రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

● డీఎంహెచ్ఓ శ్రీనివాస్

కుర్మపల్లి ఆరోగ్య ఉపకేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్

మాల్, ఫిబ్రవరి 3: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్ ఆదేశించారు. సోమవారం చింతపల్లి మండలం వీటీనగర్ పరిధిలోని కుర్మపల్లి ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి మాట్లాడారు. సిబ్బంది సమయ పాలన పాటించాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్ఓ కేసా రవి, వీటీనగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా విద్యార్థులు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన కేతావత్ మెగారాజ్, గాలం వేణు

చందంపేట, ఫిబ్రవరి 3 : మండలంలోని హంక్యతండాకు చెందిన కేతావత్ మెగారాజ్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక య్యాడు. ఇటీవల మెదక్‌లో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ఆయన పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చిడంతో రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. తండాకు చెందిన కేతావత్ రాంలాల్, చిన్ని దంపతుల కుమారుడైన కేతావత్ మెగారాజ్ హైదరాబాద్‌లోని కోఠి ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు.

నల్లగొండ రూరల్ : ఈ నెల 4 నుంచి 7 వరకు ఆదిలాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పురుషుల కబడ్డీ పోటీలకు దామరచర్లకు చెందిన గాలం వేణు ఎంపికైనట్లు ఛత్రపతి శివాజీ స్పోర్ట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొమ్మపాల గిరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ఆయన నల్లగొండ జిల్లా జట్టు తరపున ఆడనున్నట్లు పేర్కొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని వినతి

సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న మున్సిపల్ కార్మికులు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 3: పెరిగిన వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌కు వినతిపత్రం అందించారు. వారికి టప్రా సంఘం మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా పలువురు మున్సిపల్ కార్మికులు మాట్లాడుతూ 2021లో రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు వేతనం పెంచిందని, అప్పటి నుంచి జూన్ 2023 వరకు పెంచిన వేతనం ఇవ్వలేదని వెంటనే అందించాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి రామ్మూర్తి, సీహెచ్. వెంకన్న, నూకల జగదీశ్చంద్ర, సత్యనారాయణ, వాడపల్లి రమేశ్, లక్ష్మీనారాయణ, మోహన్‌నాయక్, అబ్రహం, కళావతి, వెంకన్న, లింగయ్య, వెంకటేశ్వర్లు, కార్మికులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన పెంచుకోవాలి

● జిల్లా క్షయ నివారణ అధికారి కళ్యాణ్‌చక్రవర్తి

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి

మునుగోడు, ఫిబ్రవరి 3 : క్షయ వ్యాధిపై ప్రజలు అవగాహన పెంచుకొని, దాని నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని 7వ వార్డులో స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్షయ వ్యాధిపై ప్రజలకు సరైన అవగాహన లేకపోవడంవల్ల చాలమంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్సతో పాటు సరైన పౌష్టికాహారం తీసుకుంటే నివారించవచ్చన్నారు. ఆయన వెంట డాక్టర్ నర్మద, సూపర్‌వైజర్ అజయ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న సీఐ వీరబాబు, ఎస్ఐ వెంకటేశ్వర్లు

వేములపల్లి, ఫిబ్రవరి 3: జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. రూరల్ సీఐ వీరబాబు, ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి గ్రామానికి చెందిన పోల కల్పన తన ఆరోగ్యం బాగాలేక పోవడంతో గత నెల 2న ఇంటికి తాళం వేసి నాగర్‌కర్నూల్‌లోని తన తల్లిగారింటికి వెళ్లింది. గమనించిన వేములపల్లిలోని బొడ్రాయి బజార్‌కు చెందిన దాసోజు నరేశ్‌కుమార్ అదేరోజు రాత్రి తలుపును పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించాడు. బీరువాలో బంగారు ఆభరణాలు, రూ.20వేల నగదును చోరీ చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నరేశ్‌కుమార్ తాను దొంగిలించిన బంగారు ఆభరణాలను ఇంట్లో దాచి పెట్టి నగదును ఖర్చు చేశాడు. ఇంట్లో దాచిపెట్టిన బంగారాన్ని సూర్యాపేటలో అమ్మడానికి వెళ్తుండగా పోలీసులు శెట్టిపాలెం ఎక్స్‌రోడ్డు వద్ద పట్టుకొని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని, అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంటలు

సబ్‌స్టేషన్‌లో చెలరేగిన మంటలు

కట్టంగూర్, జనవరి 3 : కట్టంగూర్ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోమవారం సాయంత్రం అగ్నిప్రమాదంలో జరిగింది. సబ్‌స్టేషన్ పైభాగంలోని ప్రొటెక్షనియల్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్ లీక్ కావడంతో షాట్ సర్క్యూట్ జరిగి మంటలు ఎగిసిపడ్డాయి. విద్యుత్ అధికారులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపి వేసి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైరింజన్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. విద్యుత్ అధికారులు కాలిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తదానిని అమర్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

గురుకుల విద్యార్థులకు ప్లేట్లు అందజేత

విద్యార్థులకు ప్లేట్లు అందిస్తున్న ప్రిన్సిపాల్ మహ్మద్ ఫారూక్

గుర్రంపోడ్, ఫిబ్రవరి3: మండలంలోని పిట్టలగూడెం మైనార్టీ గురుకుల కళాశాల విద్యార్థులకు సోమవారం కాస్మొటిక్ కిట్లు, ప్లేట్లు, షూస్‌ను కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ ఫారూక్ అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మస్న వేణుగోపాల్, అతియా అంజుం, శ్రీలత, హెల్త్ సూపర్‌వైజర్ చిరుమర్తి శీనయ్య, డిప్యూటీ వార్డెన్ షేక్ సయ్యద్ మియా పాల్గొన్నారు.

మహిళా సంఘాల ఆర్థిక పురోగతికి సహకరించాలి

● కలెక్టర్ ఇలా త్రిపాఠి

కలెక్టరేట్‌లో మీడియా సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నీలగిరి, ఫిబ్రవరి 3 : గ్రామీణ మహిళా సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేసి వారి ఆర్థిక పురోగతికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఈ నెల 4 నుంచి 8 వరకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మినీ సరస్ ఫెయిర్-2025 పోస్టర్‌ను సోమవారం తన చాంబర్‌లో ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఇందిరా మహిళ శక్తి భరోసాలో భాగంగా గ్రామీణ స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన చేనేత, హస్తకళ, ఆహార ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం నిర్వహిస్తారన్నారు. మొత్తం 45 స్టాల్స్ ఏర్పాటు చేసి ఉదయం 9 నుంచి రాత్రి 9.30 గంటల వరకు అమ్మకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. డీఆర్‌డీఓతోపాటు బ్యాంక్, ఇండస్ట్రియల్, ఐసీడీఎస్, మెప్మా తదితర శాఖలకు సంబంధించిన వస్తువుల ప్రదర్శన, అమ్మకం కూడా చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ శేఖర్ రెడ్డి, డీపీఎంలు దాట్ల అయోధ్య, గుండ్లపల్లి నరహరి, నర్సింహారావు, బెనర్జీ, రామలింగయ్య, రాము, మోహన్‌రెడ్డి, సీసీ సట్టు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రకటనల జారీకి ముందస్తు అనుమతి తీసుకోవాలి

నీలగిరి : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికలకు సంబంధించి వివిధ మాధ్యమాల ద్వారా జారీ చేసే ప్రకటనలకు ముందస్తు అనుమతి తీసుకోవాలని కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, మీడియా సెంటర్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఎంసీఎంసీ ద్వారా ప్రతి రోజు వార్తా పత్రికలు, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో వచ్చే పెయిడ్ న్యూస్, ఎన్నికల నియమావళి, వ్యతరేక, అనుకూల వార్తలను పర్యవేక్షించనున్నట్లు పేర్కొన్నారు. మీడియా సంస్థలు కూడా ఎన్నికల నియమావళిని అనుసరించాలన్నారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్, కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వశాఖ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ కోటేశ్వర్‌రావు, శేషాచార్యులు, కలెక్టరేట్ ఏఓ మోతీలాల్ పాల్గొన్నారు.

కేజీబీవీలపై కలెక్టర్ రివ్యూ

కేజీబీవీల ప్రత్యేకాధికారులతో కలెక్టర్ కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కేజీబీవీల నిర్వహణ, ఆహారం, విద్య, ప్రత్యేక తరగతులు వంటి వాటిపై సమీక్షించారు. కేజీబీవీలో చదివే విద్యార్థినులను అన్ని రంగాల్లో నిష్ణాతులుగా చేయాలన్నారు. జేఈఈ, ఎన్ఐటీ, నీట్ వంటి ఎంట్రెన్స్‌ల కోసం ప్రత్యేకంగా కోచింగ్ ఇవ్వాలన్నారు. సమావేశంలో డీఈఓ భిక్షపతి, జీసీడీఓ సరిత, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

14న స్క్రాప్ వాహనాల వేలం

నీలగిరి, ఫిబ్రవరి 3: జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ఉన్న ఎనిమిది 104 ఎఫ్‌డీహెచ్‌ఎస్ స్క్రాప్ వాహనాల వేలాన్ని ఈ-వేలం పద్ధతిలో ఈ నెల 14న నిర్వహించనున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 12లోగా ఈఎండీ చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వివరాలకు www.auction.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 3 : పంచాయతీ ఎన్నికల ముసాయిదా, పోలింగ్ స్టేషన్లు, వార్డుల జాబితాలపై అభ్యంతరాల స్వీకరణకు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉమేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని పార్టీల నాయకులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

భౌతిక శాస్త్రంపై విద్యార్థులకు అవగాహన

రామగిరి, ఫిబ్రవరి 3: భౌతిక శాస్త్రం చదివే విద్యార్థులు సబ్జెక్టుపై పట్టు సాధిస్తే ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని హెచ్‌సీయూ ప్రొఫెసర్ శ్రీనాథ్ అన్నారు. ఎంజీయూ డిపార్టుమెంట్ ఆఫ్ ఫిజిక్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం స్పిన్ ట్రానిక్స్‌లో పరిశోధన అనే అంశాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు చిల్కూరి భిక్షమయ్య, ఎన్.భిక్షమయ్య, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

గట్టుప్పల్, ఫిబ్రవరి 2 : మండలంలోని అంతంపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు భీమనపల్లి మల్లేశ్ మాతృమూర్తి మంగమ్మ ఆదివారం మృతి చెందారు. మాజీ జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, మాల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంటు జగదీశ్వర్ సోమవారం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు అందించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఇడెం కైలాసం 50 కిలోల బియ్యాన్ని అందించారు. కార్యక్రమంలో పార్టీ అంతంపేట గ్రామశాఖ అధ్యక్షుడు ఐతరాజు హనుమంతు, నాయకులు కూర బాలరాజు, తోకల నరసింహ, దండిగ శంకర్, చారి, వెంకటయ్య, అంజయ్య, లింగయ్య, ఈశ్వర్, నరేందర్‌నాయక్, రాములు, ఇస్తారి పాల్గొన్నారు.

ఆసరా సంస్థ ఆధ్వర్యంలో..

చిట్యాల : మండలంలోని వట్టిమర్తి గ్రామానికి చెందిన బెల్లపు ముఖేశ్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులకు కూడా డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ సోమవారం గ్రామానికి వెళ్లి అతడి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు అందించాడు. ఆయన వెంట సంస్థ ప్రతినిధులు సిరిపంగి శంకర్, బెల్లపు తిరుమల్లేశ్, చుక్క రాజు, సిరిపంగి మధు, ఓర్సు శ్రీధర్ ఉన్నారు.

చందంపేట ఇన్‌చార్జి తాసీల్దార్‌గా గోవర్ధన్‌రెడ్డి

చందంపేట, ఫిబ్రవరి 3 : చందంపేట ఇన్‌చార్జి తాసీల్దార్‌గా గోవర్ధన్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న తాసీల్దార్ శ్రీనివాస్ సెలవుపై వెళ్లడంతో డిప్యూటీ తాసీల్దార్‌గా ఉన్న గోవర్ధన్‌రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అలాగే నేరేడుగొమ్ము ఇన్‌చార్జి తాసీల్దార్‌గా అయూబ్ ఖాన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు.

పబ్లిక్ టాయ్‌లెట్స్ లేక ప్రజల అవస్థలు

కట్టంగూర్ సంతకు వచ్చిన వివిధ ప్రాంతాల ప్రజలు

కట్టంగూర్, ఫిబ్రవరి 3 : మండల కేంద్రంలో పబ్లిక్ టాయ్‌లెట్స్ లేకపోవడంతో ఇతర గ్రామాల నుంచి వచ్చే ప్రజలు, వాహనదారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివిధ పనుల నిమిత్తం పలు గ్రామాల ప్రజలు, విద్యార్థులు నిత్యం మండల కేంద్రానికి వస్తుంటారు. దానికి తోడు ప్రతి శనివారం జరిగే వార సంతలో సరుకులు కొనుగోలు చేసేందుకు ప్రజలు వస్తారు. అనేక మంది చిరు వ్యాపారులు రోడ్డు పక్కన బండ్లు, దుకాణాలు ఏర్పాటు చేసుకొని ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉంటారు. మండల కేంద్రంలో పబ్లిక్ టాయ్‌లెట్స్ లేకపోవడంతో కాలకృత్యాలు తీర్చుకునేందుకు ప్రజలు ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. సంతలో దుకాణాలు ఏర్పాటు చేసుకునే వీధి వ్యాపారుల నుంచి గ్రామపంచాయతీ వారు తైబజారు(పన్ను) వసూలు చేస్తున్నారు గానీ సౌకర్యాలు కల్పించడం లేదని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటి కైనా సంబంధిత అధికారులు పబ్లిక్ టాయ్‌లెట్స్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న విపంచి ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 3 : మండలంలోని బ్రాహ్మణ వెల్లెంల, కొత్తగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న నాలుగో తరగతి విద్యార్థులకు గురుకుల ఎట్రెన్స్‌కు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను సోమవారం విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్ మాట్లాడుతూ గురకులాల్లో సీటు సాధించేలా విద్యార్థులు తయారయ్యేందుకు స్టడీ మెటీరియల్ ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వినీత, శ్రీనివాస్, కార్యక్రమ కోఆర్డినేటర్ నడిగోటి శ్రీనివాస్, సరిత, అంజయ్య, సురేశ్, మధు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ కుటుంబానికి భాస్కర్‌రావు పరామర్శ

మిర్యాలగూడ, ఫిబ్రవరి 3: పట్టణంలోని చైతన్యనగర్‌కు చెందిన జంపాల ఝాన్సీ అమెరికాలో స్థిరపడ్డారు. ఇటీవల ఆమె అక్కడే మృతిచెందగా సోమవారం ఆమె మృతదేహాన్ని బంధువులు చైతన్యనగర్‌లోని ఆమె ఇంటికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు సోమవారం ఆమె నివాసానికి వెళ్లి ఝాన్సీ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ 1వ వార్డు ఇన్‌చార్జి పునాటి లక్ష్మీనారాయణ, నాయకులు గంగాధర్, కూనల గోపాలకృష్ణ ఉన్నారు.

వెల్మినేడు వైద్యాధికారికి సన్మానం

వైద్యాధికారిని సన్మానిస్తున్న వెల్మినేడు గ్రామస్తులు

చిట్యాల, ఫిబ్రవరి 3 : మండలంలోని వెల్మినేడు పీహెచ్‌సీ వైద్యాధికారి ఉబ్బు నర్సింహ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అధికారిగా ప్రశంసాపత్రం అందుకున్నారు. సోమవారం పలువురు గ్రామస్తులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సుర్కంటి సత్తిరెడ్డి, కొంపెల్లి వెంకట్‌రెడ్డి, అంతటి నర్సింహ, వట్టిపల్లి యాదయ్య, కాటం సత్తయ్య, పుల్లయ్య పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

7న హైదరాబాద్‌కు తరలిరావాలి : ఎమ్మార్పీఎస్

మునుగోడు, ఫిబ్రవరి 3 : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 7న హైదారాబాద్‌లో జరుగనున్న వెయ్యి గొంతులు-లక్ష డప్పుల మహాప్రదర్శనకు అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం మునుగోడులోని అంబేద్కర్ చౌరస్తాలో ఆవిష్కరించారు. ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించనున్న కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మైనింగ్ తవ్వకాలు అడ్డగింత

తిరుమలగిరి, ఫిబ్రవరి 3: మండలంలోని తొండ గ్రామంలో చేపడుతున్న అక్రమ మైనింగ్ తవ్వకాలను అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ.. చుట్టుపక్కల చాలామంది రైతులు వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తున్నారని, మైనింగ్ వల్ల వారు జీవనోపాధి కోల్పోతారని అన్నారు. పనులు చేపడితే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాగయ్య, వెంకన్న, ఎల్లయ్య, వెంకటయ్య, ప్రవీణ్, రవి, లక్ష్మయ్య, నవీన్, సోమనర్సయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

ఎన్నికల ముందు కోతలు.. తర్వాత ఎగవేతలు

● కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్నీ మోసాలే ● మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్, ఫిబ్రవరి 3 : కాంగ్రెస్ ప్రభుత్వ ఎన్నికల ముందు కోతలు కోసి ఎన్నికల అనంతరం ఎగవేతలుగా మార్చిందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఎద్దేవా చేశారు. నకిరేకల్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏడాది కింద ప్రజాపాలన పేరిట, కులగణన పేరిట, గ్రామసభల పేరిట దరఖాస్తులు తీసుకోవడం తప్ప పరిష్కరించింది లేదన్నారు. అబద్ధపు పునాదుల మీద అధికారంలోకి వచ్చి, పాలనలోనూ అబద్ధాల పరంపరనే కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందని విమర్శించారు. పదేండ్ల కేసీఆర్ హయాంలో ఎలాంటి దరఖాస్తులు లేకుండా సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. 11 విడుతల్లో 73 వేల కోట్ల రూపాయల రైతుబంధు ఇచ్చారని తెలిపారు. 13 లక్షల మందికి లక్ష రూపాయల చొప్పున కల్యాణలక్ష్మి పథకం ఇచ్చారని చెప్పారు. ప్రతిపక్షాన్ని, కేసీఆర్‌ను తిట్టడం తప్ప రేవంత్‌రెడ్డికి పాలన చేతకాదన్నారు. ఆడంబరంగా నిర్వహిస్తున్న గ్రామసభల సాక్షిగా తమ ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత తేటతెల్లమైందని తెలిపారు. ఊర్లల్లో తిరగబడుతున్న జనాన్ని చూస్తే ఏడాది పాలన పెద్ద ఫెయిల్యూర్ అని అర్థమవుతుందన్నారు. పథకాలలబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం ఒక వైపు గ్రామసభలు నిర్వహిస్తుంటే మరోవైపు కాంగ్రెస్ కార్యకర్తలకే పథకాలు ఇస్తామని అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు చెప్పడం సిగ్గుచేటని మండిపడ్డారు. రుణమాఫీ, రైతుభరోసా, పంట బోనస్, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అర్హులందరికీ ఇస్తామని చెప్పి ఇప్పుడు భారీ కోతలు విధిస్తే ప్రజలు తిరగబడకుంటే ఏం చేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల పాపం..అధికారులకు శాపంగా మారిందని, అధికారులు సమాధానం చెప్పలేకపోతున్నారని తెలిపారు. ఎన్నికల హామీల్లో చెప్పినట్లుగా అర్హులైన అందరికీ ప్రభుత్వ పథకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ తీర్మాన్ మల్లన్న కేసీఆర్ చేసిన సర్వేనే బాగుందని అని చెప్పారని గుర్తుచేశారు. బీసీలకు 52 శాతం రిజర్వేషన్ ఇస్తా అన్న రేవంత్‌రెడ్డి ఆ ప్రస్తావన లేకుండా చేశారన్నారు. ఎన్ని డైవర్షన్ పాలిటిక్స్ చేసినా 6 గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేసేంతవరకూ ప్రజల పక్షాన నిలబడతామని చెప్పారు. ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, కౌన్సిలర్ పల్లె విజయ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, ప్రధాన కార్యదర్శి నోముల కేశవరాజు, మారం వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు గుర్రం గణేశ్, రాచకొండ వెంకన్న, నాయకులు పెండెం సదానందం, అవిరెండ్ల జనార్దన్, సత్యనారాయణ, కొండ వినయ్ తదితరులు పాల్గొన్నారు.


పార్టీ కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్

బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటాం

● మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా, ఫిబ్రవరి 3 : బీఆర్ఎస్ కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ అన్నారు. హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహింపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త లింగాల సత్యం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బీఆర్ఎస్ పార్టీ కల్పించిన ప్రమాదబీమా కింద అతడి కుటుంబానికి మంజూరైన రూ.2 లక్షల చెక్కును సోమవారం నోముల భగత్ కార్యకర్త ఇంటికి వెళ్లి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం ఉన్న, లేకున్నా కార్యకర్తల సంక్షేమానికి, రాష్ట్ర అభ్యున్నతికి బీఆర్ఎస్ పార్టీ మొదటి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ కార్యకర్తలు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట మాజీ ఆప్కాబ్ మాజీ చైర్మన్ ఎడవల్లి విజయేందర్‌రెడ్డి, పార్టీ నాయకులు ఎడవల్లి మహేందర్‌రెడ్డి, చాపల సైదులు, సురభి రాంబాబు, చాపల వెంకన్న, జాల సైదులు, నాదేండ్ల నర్సింహా, గోగు అచ్చాలు, నవీన్, లింగాల రాంబాబు, మహేశ్, నల్లబోతు శంకర్ ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలి

● బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దన్

స